

గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- జీవనోపాధి మెరుగుపరచాలి
- కలెక్టర్ రాజకుమారి
- చిన్నారుల గిరిజన సంప్రదాయ నృత్యాలు



గిరిజన సంఘాల నాయకులతో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఐటీడీఏ పీవో వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గిరిజన బాలికల కోసం 13 ఆశ్రమ పాఠశాలలు 9 గిరిజన వసతి గృహాలను నిర్వహిస్తున్నారన్నారు. గిరిజనులు చెడు వ్యసనాలకు లోను కాకుండా వారి జీవనోపాధి మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. చెంచుగూడేల్లోని తల్లిదండ్రులు తమపిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. చెంచెగూడేల్లోని పీవీటీజీలకు ఇళ్ల నిర్మాణాల కోసం కేంద్రప్రభుత్వం ద్వారా రూ.1.80లక్షలు, రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా 600 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గిరిజన సంఘాల నాయకులు కూడా ముందుకు వచ్చి ఇండ్ల నిర్మాణాలను వేగవం తంగా చేసేలా చూడాలని గిరిజన సంఘాల నాయకులను కోరారు. గిరిజన వేషాధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రతి ఒక్కరినీ అలరించాయి. ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడిన గిరిజన సంఘాల నాయకులను కలెక్టర్ శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

గురు రాఘవేంద్ర నమో నమః

- టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ
- ఉత్సవమూర్తికి తెప్పోత్సవం



మూలరాములకు మంగళహారతి ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గురు రాఘవేంద్ర నమో నమః అంటూ వేలాది మంది భక్తులు రాఘవేంద్రస్వామి సన్నిధిలో తరించారు. రాఘవేంద్రస్వామి 354వ సప్త రాత్రోత్సవాల్లో రెండో రోజు శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూల బృందావ నానికి ప్రత్యేక పూజలు చేశారు. మూలరాములకు చేసిన కనకాభిషేకం భక్తులను కనువిందు చేసింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊం జల సేవలో ఊగిస్తూ పీఠాధిపతి శాకోత్సవం చేసి మహా మంగళహా రతులు ఇచ్చారు. టీటీడీ నుంచి అధికారికంగా జేఈవో (పేష్కర్) రామకృష్ణ తెచ్చిన పట్టువస్త్రాలు, ప్రసాదాన్ని ముఖ ద్వారం నుంచి ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, సురేష్ కోనా పూర్, ఏఏవో మాధవశెట్టి, స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకువచ్చారు.


మిగతా 6వ పేజీలో



పుష్కరిణిలో ప్రహ్లాదరాయల తెప్పోత్సవం

కొలనుభారతిలో కొండపై నుంచి జాలువారుతున్న జలపాతం





చిన్నగుమ్మితం సమీపంలో నల్లమల నుంచి జాలువారుతున్న జలపాతం

జల సోయగాలు

- ఎత్తైన కొండ నుంచి జాలువారుతున్న జలపాతాలు
- పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్న నల్లమల
- పర్యాటకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్న అడవితల్లి
- ఆకట్టుకుంటున్న చిన్నగుమ్మితం సమీపంలోని జలపాతం
- పుణ్యతీర్థంగా కొలనుభారతి చారుఘోషిణి..
- జీవ వైవిధ్యంలోనూ చెరగని ముద్ర

నల్లమలలో ఇటీవల కురిసిన వర్షాలతో అడవి అంతా పచ్చదనంతో నిండిపోయింది. ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది. పక్షుల కిలకిలరావాలు.. సెలయేళ్ల పరవళ్లు.. ఎత్తయిన కొండల నుంచి జాలువారే జలపాతాల సోయగాలు పర్యావరణ ప్రేమికుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. రాష్ట్రంలోని పలుప్రదేశాల్లో ఉన్న జలాపాతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందినప్పటికీ నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో ఉన్న నల్లమల జలపాతాల గురించి చాలావరకు బాహ్య ప్రపంచానికి తెలియదు. పెద్దపులుల సంరక్షణ అత్యంత సున్నితమైన ప్రక్రియ కావడంతో నల్లమలలోని జలాపాతాల వద్దకు పర్యాటకులు వెళ్లేందుకు అటవీ అధికారులు అనుమతించడం లేదు. ఇక్కడి అద్భుతమైన జలపాతాల గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో నల్లమలలో ఎత్తైన కొండల నుంచి జలపాతాలు జాలువారుతున్నాయి. సుమారు 100-200 అడుగుల ఎత్తు గల కొండల మీద నుంచి వర్షపునీరు కిందికి ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. ఈవిధంగా చేరే నీరు సెలయేళ్ల ద్వారా అటవీ ప్రాంతంలోని వాగులు, వంకల్లో ప్రయా ణిస్తూ వన్యప్రాణుల దాహాన్ని తీరుస్తోంది. వర్షాలు అడపాదడపా కురిసినప్పటికీ జలపాతాలు మాత్రం సుమారు రెండు, మూడు నెలల పాటు నిరంతరం ప్రవహిస్తాయి. ప్రత్యేకించి నల్లమలలోని చిన్నగుమ్మితం ఆలయానికి సమీపంలో వున్న జలపాతం పర్యాట కుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆత్మకూరు రేంజ్‌లోని కొలను భారతి, శ్రీశైలం రేంజ్‌లోని భీమునికొలను, పెచ్చెర్వు సమీపంలోని పంగిడి, వెలుగోడు రేంజ్‌లోని మొత్త వద్ద వున్న నాగులగుండం, నాగలూ టి రేంజ్ ఇందిరేశ్వరం ఈస్ట్‌బీట్‌లో వున్న చిన్నసరి, పెద్దసరి జలపాతాలు, రోళ్లపెంట బేస్‌క్యాంప్ సమీపంలో వున్న జలపాతం, శ్రీశైల క్షేత్రంలోని సిద్దరామప్పకొలను జలపాతాలు ఉన్నాయి. అయితే వీటిలో చాలా వరకు నల్లమల అంతర్భాగంలోనే ఉండటం వల్ల అక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు అటవీ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి వుంటుంది. కొలనుభారతి క్షేత్రంలో జాలువారే జలపాతమే చారుఘోషినీ పుణ్యతీర్థంగా మారుతోంది.

నల్లమలకు విశేషమైన ప్రాముఖ్యత..



నల్లమలలోని సెలయేళ్ల సవ్వడులు

జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలో నల్లమలకు విశేషమైన ప్రాముఖ్యత ఉంది. వేల సంవత్సరాల నుంచి అనేక వృక్ష, జంతు, మత్స్య, పక్షిజాతులను సమైక్య భాగస్వాములుగా చేర్చి పర్యావరణ చక్రంలో జీవం పోస్తోంది. నల్లమలలో గుర్తించ బడిన సుమారు 1500రకాల వృక్షజాతులు, 200రకాల పక్షిజాతులు, 80రకాల గడ్డిజాతులు, 350 రకాల ఔషధమొక్కలు, 55 రకాల మత్స్యసంపద, 80రకాల సరిసృపాలు, 20 రకాల ఉభయచరజీవులకు నల్లమల అడవులు ఆవాసాన్ని కల్పిస్తున్నాయి. ప్రత్యేకించి పర్యావరణ సూచికలో త్రికోణ అగ్రభాగాన నిలిచిన పెద్దపులి ఆవాసానికి సైతం నల్లమల అనుకూలం. ప్రకృతి అందాలతో పాటు జీవవైవిధ్యంలోనూ నల్లమల చెరగని ముద్ర వేసుకుంది.

నల్లమలలోని జలపాతాలు..

వర్షాకాలంలో ఆయా జలపాతాలు నిండుగా జాలువారడంతో వాటిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తారు. నల్లమలలోని జలపాతాలు చాలా వరకు బాహ్యప్రపంచానికి తెలివని చెప్పవచ్చు. రాష్ట్రంలో ప్రధా నంగా చిత్తూరు జిల్లాలోని తలకోన, తడ, గుంటూరు జిల్లాలోని ఎత్తిపోతల జల పాతం, విశాఖపట్నం జిల్లాలోని కటికి, కొత్తపల్లి, డుడుమ జలపాతాలు, శ్రీశైలం- హైదరాబాద్ రహదారి మధ్యలో మల్లెలతీర్థం జలపాతం ప్రాచుర్యంలో ఉన్నాయి.



ఆత్మకూరు నుంచి దోర్నాల మధ్యలో కేజీరోడ్డుపై నల్లమల అందాలు

అల్లుకున్న పచ్చదనం

నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు(కేజీ) జాతీయ రహదారిపై పచ్చదనం అల్లుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుకిరువైపుల ఉన్న చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి రహదారిని కమ్మివేసేలా దర్శనమిస్తూ ఆకర్షణగా నిలుస్తున్నాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు మార్గమధ్యలో నిలిచి నల్లమల అందాలు ఆస్వాదిస్తున్నారు. కేజీ రోడ్డుకు ఇరువైపులా పచ్చికబయళ్లు ఉన్న పలు ప్రదేశాల్లో జింకలు, ఇతర వన్యప్రాణులు ప్రయాణికుల్ని కనువిందుకు చేస్తున్నాయి. బైర్లూటి నుంచి దోర్నాల సమీపంలోని కొర్రప్రోలు వరకు కేజీ రహదారి ఇలాగే పచ్చదనాన్ని సంతరించుకుంది. ప్రత్యేకించి రోళ్లపెంట ఘాట్ వద్ద ఉన్న కొండలు సైతం పచ్చదనాన్ని సంతరించుకుని ప్రకృతి సంపదలుగా నిలుస్తున్నాయి. నల్లమల సోయ గాలుల నడుమ కేజీరోడ్డుపై సాగే ప్రయాణం చెరిగిపోని జ్ఞాపకాలను నింపుతోంది.

పంట రక్షణకు రైతుల పాట్లు

- ట్రాక్టర్, ఆయిల్ ఇంజన్లతో నీటిని తడుపుతున్న అన్నదాతలు



శెట్టివీడు రహదారిలో నీటి కుంట వద్ద ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజన్

చాగలమర్రి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసే రైతన్నకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టపోతున్నారు. ఈ ఏడాది మే నెలలో ముందస్తుగా వర్షాలు అధికంగా కురవడంతో రైతులు అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 60 రోజులు దాటిన వానజాడ లేక సాగు చేసిన మొక్కజొన్న, మినుము, కంది, పెసర తదితర పంటలు వాడుముఖం పట్టాయి. దీంతో రైతులు దిక్కుతోచక ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు రోజు రోజుకు పెరుగుతున్న ఉక్కపోత, వేడి గాలులతో ప్రజలు, రైతులు ఉక్కిరిబిక్కిరి, మరో వైపు వేసవిని మించి పొడి వాతావరణంతో, పంటల సాగుకు నీటి ఎద్దడితో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి మండలంలోని శెట్టివీడు, గొడిగనూరు, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో నీటి ఇబ్బందులతో రైతులు కష్టాలు పడుతున్నారు. ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు టీజీపీ ద్వారా ప్రవహిస్తున్న వంకలు, వాగుల వద్ద ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్‌లు ఏర్పాటు చేసి పైపుల ద్వారా పంట పొలాలకు నీరు తోడుతున్నారు. వరుణ దేవుడి కరుణం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వాగులు, వంకల వద్ద ట్రాక్టర్ ఇంజన్‌లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పంట పొలాల వరకు 2 కి.మీ. దూరంలో ఉన్న పంటను కాపాడుకోవడానికి 70 అడుగుల పైపులు వేసి పంటలను తడుపుకుంటున్నారు. ఎలాగైన పంటలను కాపాడుకోవాలని అన్నదాత ప్రయత్నం సాగిస్తున్నారు.



మొక్కజొన్న పంటకు పైపుతో నీరు తడుపుతున్న రైతు

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఏదశలో ఉందో తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

మాజీ ఆర్మీ అధికారి ఇంటిపై దాడులు

- 53 డిఫెన్స్ మద్యం బాటిళ్లు సీజ్
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

7

రాష్ట్రంలో లంచగొండి రాజ్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లంచగొండి రాజ్యం నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. శనివారం నగరంలోని పాతబస్టాండు అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా 24వ మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా జిల్లా పరిషత్ నుంచి కళాకారులు, నాయకులు, కార్యకర్తలతో భారీ ఊరేగింపుగా పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. నగరం అంతా ఎర్రజెండాలతో రెపరెపలాడింది. మహాసభలకు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యు లు పి.రామచంద్రయ్య, జగదీశ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.రామాంజనేయులు, ఆవుల శేఖర్, లెనిన్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 1.47లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కూటమి ఎమ్మెల్యే బియ్యం అమ్ముకోవడానికి అంగళ్లు తెరిచారని విమర్శించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. టీడీపీ-జనసేన పార్టీ నాయకులు రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని ప్రచారాలు చేస్తున్నారు...లంచం లేకుండ ఎక్కడ ఏ కార్యాలయంలో పని జరగడం లేదన్న విషయం పాలకులు తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్న డూ, ఎవరూ చేయనివిధంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రూ.1,75,000 వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఇదే నెలలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో జాతీయ మహాసభలు చండీఘర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. కళాకారులు ఆలపించిన గేయాలు, నృత్యా లు పలువురిని ఆకర్షించాయి. వివిధ ప్రాంతాల్లోని స్థూపాల నుంచి తీసుకువచ్చిన అరుణ పతాకాలను అతిథులకు అందజేశారు. అమరవీరులకు జోహర్లు అర్పించారు. కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం, సలహాదారుడు భీమలింగప్ప, జె.లలితమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నంద్యా ల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి, రామకృష్ణారెడ్డి, అజయ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రబీరసూల్, పంపన్నగౌడు పాల్గొన్నారు.



కర్నూలులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

తుంగభద్ర తీరం సాహిత్యం

సీమ ఫ్యాక్షన్ కథా సంకలనం నిచ్చెన



రచయిత ఇనాయతుల్లా



కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని పల్లెల్లో రాజ్యమేలిన ముఠాకక్షలు, వాటికి ఆధిపత్యం వహిస్తున్న పెత్తందారి నాయకుల మధ్య నలిగిపోయిన బహుజన కులాల అనుచరుల వ్యథలను వ్యక్తం చేసే కథల సమూహారమే 'నిచ్చెన' కథా సంపుటిలోని కథలు. కర్నూలు చెందిన కథారచయిత ఇనాయతుల్లా రాసిన ఈ కథా సంకలనంలో అనేక అంశాలను ఆయన స్పృశిస్తూపోయారు. ఒకప్పుడు పాశావికంగా తలలు నరుకునే స్వభావం నుంచి రాజకీయ నేపథ్యంలో కుర్చీల కుమ్ములాట పోరు వరకు ఈ సంకలనంలోని కథలు తెలియజేస్తాయి. నిచ్చెన కథలో కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలోని ఒకనాటి నాయకుల ఆధిపత్య స్వభావాన్ని, దాని కోసం వారు సాగించిన నరమేధాన్ని కళ్లకు కట్టినట్లు ఆ కథల్లో చిత్రీకరించారు. అలాగే వలస అనే కథలో పల్లెల నుంచి బడుగు, బలహీనవర్గాల ప్రజలు జీవనోపాదికి తట్టబుట్ట సర్దుకుని వలసలు వెళ్లిపోవడం వారి బ్రతుకు చిత్రాలకు అద్దం పడుతుంది. 1990 ప్రాంతంలో అప్పటి పాలకులు జన్మభూమి పథకం ద్వారా ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించి గ్రామీణ కూలీల జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన విధానం కూడా కథల్లో కనిపిస్తాయి. గ్రామాల్లో రిజర్వేషన్ల పుణ్యమా అని రాజకీయ పదవులు అనగారిన వర్గాలకు లభించినా ఆధిపత్యం మాత్రం ఉన్నత వర్గాలకే అని కొన్ని కథలు తెలియజేస్తాయి. ఒక ఫ్యాక్షన్ నాయకుడిని నమ్ముకుని సేవలు చేసే అనుచరుడు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన విధానాన్ని నిచ్చెన అనే కథలో రచయిత హృద్యంగా వివరిస్తారు. ఈ సంకలనంలో ముస్లిం మైనార్టీల బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే కథలు గూడు, ముసుగు, పురుడు వంటి కథలు పాఠకులను అలరింపజేస్తాయి. 'గుప్పెడు గుండె' అనే మరో కథ నగరాల్లో బలహీనమవుతున్న మానవ సంబంధాలను తెలియజేస్తుంది. ఒకనాడు పల్లెల్లో సామూహికంగా కలిసి బతికిన మనిషి నేడు అపార్టుమెంటు కల్చర్‌లో ఏకాకిగా మారిపోయిన విధానాన్ని ఆయన చక్కగా వర్ణించారు. పల్లెల్లో జరిగే దసరా, సంక్రాంతి, ఉగాది, పీర్ల పండుగ సంబరాలను తెలియజేసే కథల్లో 30-40 దశాబ్దాల క్రితం పల్లెల్లోని సంస్కృతిని ప్రతిబింబింపజేస్తాయి. నిచ్చెన కథల సంకలనానికి సుప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి ముందుమాట రాశారు. కథాసమయం సాహితీ సంస్థ వేత్తలు ఇనయతుల్లాను కథకునిగా పరిచయం చేశారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాష్ నారాయణ కూడా అసెంబ్లీ సమావేశాల్లో రాయలసీమ ఫ్యాక్షన్ అంశాన్ని నిచ్చెన కథల సంపుటి లోని అంశాలను ప్రస్తావిస్తూ మాట్లాడారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తుంది.

చౌడేశ్వరీమాతకు వెండి శ్రీచక్రం విరాళం



వెండి శ్రీచక్రం విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత అమ్మవారికి బెంగుళూరుకు చెందిన పీవీ.రావు కుటుంబ సభ్యులు వెండి శ్రీచక్రం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి శనివారం అందించారు. అమ్మవారిమీద భక్తితో రూ.1.17లక్షల విలువగల వెండి శ్రీచక్రం విరాళం ఇచ్చారు.

టార్గెట్‌బాల్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

● అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పాణ్యం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు టార్గెట్‌బాల్ రాష్ట్రస్థాయి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8, 9వ తేదీల్లో తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన అసోసియేషన్ జూనియర్స్ మీట్‌లో బాలుర విభాగంలో టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనబరచి తృతీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గురు రాఘవేంద్ర నమో నమః



పుష్కరిణిలో తెప్పోత్సవం నుంచి మాట్లాడుతున్న పీఠాధిపతి

5వ పేజీ తరువాయి

శ్రీమఠంలో పీఠాధిపతి టీటీడీ పట్టువస్త్రాలను తలపై మోసుకుని వచ్చి బృందావనం ముందు ఉంచి హారతులు ఇచ్చి ఊంజల మండపం వద్ద పీఠాధిపతికి పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రసాదం తెచ్చిన టీటీడీ అధికారి రామకృష్ణకు పీఠాధిపతి శేసవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు.

పుష్కరిణిలో తెప్పోత్సవం..

రూ.3.50 కోట్లతో బెంగుళూరు చెందిన ప్రకాశ్‌శెట్టి అను భక్తుడు నిర్మించి విరాళంగా ఇచ్చిన పుష్కరిణిలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలు తెప్పోత్సవంలో విహరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలు మధ్య తెప్పోత్సవంలో స్వామివారి పుష్కరిణిలో విహరిస్తుండగా 'తుంగా తీరా నివాసా'.. మంత్రాలయం నివాసా గోవిందా గోవిందా.. జయహో గురు రాఘవేంద్ర విజయహో అంటూ భక్తులు పెద్దఎత్తున నినాదాలు చేసి పరవశించారు. మంత్రాలయంలో తొలిసారి పుష్కరిణి ఏర్పాటుచేసి తెప్పోత్సవం నిర్వహించడంతో పులకరించిపోయి తన్మయం చెందారు.

నేడు పూర్వారాధన

రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ప్రాముఖ్య దినమైన ఆదివారం రాఘవేంద్రస్వామి పూర్వారాధన కార్యక్రమం జరగనుంది.



శాకోత్సవం చేస్తున్న పీఠాధిపతి

350 మంది పోలీసులతో ఉత్సవాల బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీలు

శ్రీమఠంలో ఉత్సవాల్లో భాగంగా ప్రధాన వేడుకలు జరిగే 10, 11, 12 తేదీల్లో 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎమ్మిగనూరు, కర్నూలు, పత్తికొండ డీఎస్పీలు ఎంఎస్ భార్గవి, బాబు ప్రసాద్, వెంకట్రామయ్య తెలిపారు. ఈమేరకు శనివారం వారు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలీసులకు పలు సూచనలు చేశామన్నారు. వీరి వెంట మంత్రాలయం సీఐ రామాంజులు, శ్రీనివాస్ నాయక్, ఎస్‌ఐ శివాంజల్, గోపినాథ్, పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేటి పూజలు

రాఘవేంద్రస్వామి 354వ ఆరాధన మహోత్సవాల్లో జరిగే మూడో రోజు ఆదివారం జరిగే పూజా కార్యక్రమాలు..


- తెల్లవారుజాము 4గంటల నుంచి 5గంటల వరకు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం. అనంతరం 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం
- ఉదయం 6నుంచి 8.30గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, పంచామృతాభిషేకం. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం
- ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ,
- మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహామంగళహారతి, తీర్థప్రసాదాలు.
- సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం. రాత్రి 8.30 గంటలకు రథోత్సవాల్లో భాగంగా సింహ వాహనంపై ప్రహ్లాదరాయలు దర్శనమివ్వనున్నారు.

నేడు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరాధన ఉత్సవాల్లో మూడో రోజు ఆదివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు బెంగుళూరుకు చెందిన వెంకటేశ్ అండ్ బృందం వారిచే నాగసరంగి, 6.30 నుంచి 8.30 గంటల వరు రాఘవేంద్ర ప్రశస్తి అవార్డులు ప్రదానం, రాయచూరు చెందిన కర్ణాటక కళామండలం వారిచే నృత్య రూపకం భక్తులను అలరించనున్నాయి.

ఆకట్టుకున్న భరతనాట్యం

ఉత్సవాల్లో రెండో రోజు శనివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో ఉడిపికి చెందిన భార్గవి నృత్య తాండా బృందం వారిచే భరత నాట్యం అలరించింది. చెన్నైకి చెందిన కన్యాకుమారి వాయిలీన్ వాయిద్యం, పుత్తూరు చెందిన జగదీష్ వారిచే దాసవాని సాహిత్యం అలరించింది. కళాకారులకు పీఠాధిపతి శేషవస్త్రం, జ్ఞాపిక, నగదు, ఫల, పుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించి ఆశీర్వదించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



పల్లకిపై ఉత్సవమూర్తి విహారం

భక్తులతో కిక్కిరిసిన రణమండల కొండ

● శ్రావణమాసం మూడో శనివారం ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



మెట్లమార్గంలో కొండపైకి వస్తున్న భక్తులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని రణ మండల కొండపై శ్రావణమాస పూజల కోసం వచ్చిన భక్తులతో కొండ కిటకిటలాడింది. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో ఆదోని ప్రాంత భక్తులే కాకుండా జిల్లా నలుమూల నుంచి కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆ రణమండల ఆంజనేయుడిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామునే స్వామివారికి సింధూర అర్చన, హారతి, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకీ సేవ అనంతరం మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. దాతల సాయంతో పట్టణంలోని శ్రీనివాస భవన్ నుంచి రణమండల కొండపైకి తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు.



ఆంజనేయుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా సమావేశం శనివారం కర్నూలు మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర సహాయ అధ్యక్షులు హేమంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జగన్నాథం, శ్రీధర్‌మూర్తి ఎన్నికయ్యారు. సహాయ అధ్యక్షుడిగా సిద్ధు, ట్రెజరర్‌గా సురేష్, ఉపాధ్యక్షులుగా సుధాకర్ రెడ్డి, లక్ష్మన్న, రవికుమార్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాసులు మహేష్, హుస్సేన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అంకాలప్ప నాయుడు, రియాజ్ బాషా, బలరాం తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు.



ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గ సభ్యులు

ఏజెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కమీషన్ పద్ధతిని డైరెక్ట్ ఏజెంట్స్‌ను నియమిస్తారని వివరించారు. పదో తరగతి పాసై ఆపైన చదివి 18సంవత్సరాలు పూర్తయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20వరకు (ఆదివారం మినహా) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరిక్రిష్ణారెడ్డి సెల్‌నెంబర్: 7013029312కు సంప్రదించాలని కోరారు.

అన్నదానానికి రూ.1,00,116 విరాళం



దాతలకు స్వామివారి జ్ఞాపికను బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు వంశీధర్‌సింగ్, నిఖిత సుమ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. శనివారం అన్నదాన కమిటీ ఛైర్మన్ రామయ్యకు అప్పగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘ నంగా సత్కరించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనాలు అందజేసి స్వామివారి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం సజావుగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో జక్కా మురళీ, పెద్దన్న, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, అర్చకులు అనిల్‌కుమార్, సుదేంద్ర తదితరులు ఉన్నారు.

జీవితమే కష్టాల పాన్పు



అన్నం తినిపిస్తున్న మనవరాలు

- చిన్నతనంలోనే దూరమైన తల్లిదండ్రులు
- కొన్నాళ్లు అనాథశ్రయంలో..
- మూడేళ్ల క్రితం జేజమ్మకు పక్షవాతం
- పరశురాంపైనే కుటుంబ భారం

ఆ ఇద్దరు పిల్లల జీవితం కష్టాల కడలిలో సాగుతోంది. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. జేజమ్మ ఇతరుల సహాయంతో వీరిని అనాథశ్రమంలో చేర్పించింది. కొన్నాళ్ల పాటు అక్కడే ఉండి చదువుకున్నారు. అంతా సవ్యంగా సాగుతున్నాయని అనుకున్న తరుణంలో మరోసారి విధి వీరితో వింత నాటకమాడింది. జేజమ్మ అయిన లింగమ్మ పక్షవాతం బారిన పడింది. అంతే మళ్లీ ఈ చిన్నారులకు కష్టాలు మొదలయ్యాయి. జేజమ్మను మనీషా సపర్యలు చేస్తూ కంటికి రెప్పల్లా కాపాడుకుంటోంది. కుటుంబ భారమంతా మనవడు పరశురాం' పై పడింది. నిరంతరం కష్టాలతో సాగుతున్న వీరి జీవితంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

కోడుమూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో కురువ లింగమ్మ అనే వృద్ధురాలు నివసిస్తోంది. ఆమె కుటుంబ దీనగాథ ప్రతి ఒక్కరికీ కన్నీళ్లను తెప్పిస్తాయి. లింగమ్మ పెద్ద కుమారుడు మస్తాన్, కోడలు షేకున్‌లకు కొడుకు పరుశురాం, కూతరు మనీషా సంతానం. పెద్దగా ఆస్తిపాస్తులు లేని వారు అప్పట్లో కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు. 12 ఏళ్ల క్రితం కోడలు శేకున్ కామెర్లతో మృతి చెందడం, ఆపై ఏడాదిలోగా కొడుకు మస్తాన్ కూడా కడుపునొప్పి కారణంగా చనిపోవడం లింగమ్మను కుంగదీశాయి.

కుటుంబ బాధ్యత లింగమ్మపైనే..

తల్లిదండ్రులు మృతిచెందినప్పుడు పరశురాం వయస్సు ఆరేళ్లు. మనీషాకు కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే. వీరి ఆలనా పాలనా చూసే వారు ఎవరూ లేకపోవడంతో ఆబాధ్యత అంతా జేజమ్మ అయిన లింగమ్మ మీదే పడింది. దీంతో ఆమె తెలిసిన వారి సహకారంతో పిల్లలను ఓ అనాథాశ్రమంలో చేర్పించింది. అక్కడే కొన్నేళ్ల పాటు పిల్లలు చదువుకున్నారు.

పక్షవాతం సోకడంతో..

మూడేళ్ల క్రితం లింగమ్మకు పక్షవాతం సోకింది. లేవలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో అనాథాశ్రమంలో ఉన్న పిల్లలను తీసుకువచ్చారు. పిల్లల చదువు మధ్యలో ఆగిపోయింది. లింగమ్మకు పింఛన్ వస్తోంది. ఆ డబ్బులు ఆమెకు ఖర్చులు, మందు లకు సరిపోతాయి. దీనికితోడు లింగమ్మకు సాయంగా ఓ మనిషి ఉండాల్సిన పరిస్థితి. స్నానం చేయించడం, దుస్తులు మార్చడం, అన్నపానీయాలు అందించడం వంటి పనులను మనీషా చూస్తుంది.



బేల్దార్ పనులకు వెళ్తూ..

పరశురాం రోజూ బేల్దారి పనులకు వెళ్తాడు. అలా వచ్చిన కూలీ డబ్బులతో కుటుం బాన్ని నెట్టుకొస్తున్నాడు. పరశురాం పనికి వెళ్లగా వచ్చిన డబ్బులతోనే ఇల్లు గడుస్తుంది. ఏదైనా జ్వరం, అనారోగ్యం కలిగి పనికి వెళ్లకపోతే అప్పు చేయాల్సిన పరిస్థితి. నివసిస్తున్న మట్టిమిద్దె కూడా కూలిపోయి అరుగు మాత్రమే మిగిలి ఉంది. దినదినం అతికష్టం మీద నెట్టుకొస్తున్నారు. ఇల్లు బాగుచేసుకునే అవకాశం ఎక్కడిదని పరశురాం కన్నీటి పర్యంతమయ్యాడు. కొందరికి జీవితం పాలపాన్పు కావచ్చేమో పరశురాంకు సుడిగుండమే.



బేల్దారి పని చేస్తున్న పరశురాం

వ్యక్తిపై కేసు నమోదు

బండిఆత్మకూరు ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన రాజారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ శనివారం తెలిపారు. మండలంలోని కడమలకాల్వకు చెందిన రాజేష్ అనే వ్యక్తికి చెందిన కారును రాజారెడ్డి బాడుగకు తీసుకున్నాడు. ఇంతవరకు బాడుగ చెల్లించలేదని, కారు ఇవ్వలేదని రాజేశ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డోన్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వెంకటాపురం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. డోన్ పట్టణం ఇందిరానగర్‌కు చెందిన నూర్‌బాషా (40) బైక్‌పై వెంకటాపురం రోడ్డులో వెళ్తుండగా.. కంబలపాడు నుంచి ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొన్నది. దాంతో నూర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వచ్చిన భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి

బనగానపల్లె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని చెర్వుపల్లె గ్రామానికి చెందిన అయినాబాషా తన భార్యపై దాడి చేశాడు. వివరాలివీ.. నంద్యాలకు చెందిన షేక్ అయిషాకు ఎనిమిదేళ్ల క్రితం చెర్వుపల్లె గ్రామానికి చెందిన అయినాబాషాతో వివాహమైంది. అయితే గత నాలుగేళ్ల నుంచి అయినా తాగుడుకు బానిసై, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని అయిషాను శారీరకంగా, మానసికంగా నిత్యం వేధించేవాడు. శనివారం ఇంట్లో అయిషా తలపై భర్త కట్టెతో కొట్టాడు. దీంతో ఆమెకు రక్తగాయాలయ్యాయి. అయిషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కానిస్టేబుల్‌పై జనసేన నాయకుడి దాడి

నంద్యాల టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్యాట్ పార్టీ కానిస్టేబుల్‌పై జనసేన నాయకుడు, అనుచరులు దాడి చేశారు. ఈఘటన నంద్యాల పట్టణ శివారులోని రైతునగరంలో శుక్రవారం చోటుచేసుకున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణ శివారులో గుట్కా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు క్యాట్ పార్టీ పోలీస్ అక్కడికి వెళ్లి ఇలాంటి పనులు చేయకూడదు అన్నందుకు కానిస్టేబుల్ మనిపై జనసేన నాయకుడు సుధాకర్, ఆయన అనుచరులు జయంత్, మరో ఇద్దరు దాడి చేశారు. జనసేన నాయకుడు మాత్రం కానిస్టేబుల్ డబ్బులు అడిగినందుకు వాగ్వాదం జరిగిందని చెబుతున్నారు. బాధితుడు మని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు



నిందితుల అరెస్టును చూపిస్తున్న సీఐ యుగంధర్

- బంగారం, నగదు స్వాధీనం

ఆళ్లగడ్డ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్సేన్‌రెడ్డి వీధిలో ఈనెల 2న జరిగిన చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బండల వ్యాపారం చేసుకొని జీవిస్తున్న సంజీవరాయుడు అనే వ్యక్తి ఈనెల 2న అర్ధరాత్రి తన ఇంటికి తాళాం వేసి కుటుంబ సభ్యులతో చర్చిలో ప్రార్థనకు వెళ్లారు. ఆ సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.1,27,500 నగదు, మూడు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఈ కేసుకు సంబంధించి టౌన్ ఎస్ఐ జయప్ప పోలీసు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి వారం రోజులలోనే కేసును ఛేదించినట్లు తెలిపారు. సంతోష్, విజయ భాస్కర్, నాగేంద్ర, వరలక్ష్మిని అరెస్టు చేసి నగదు, బంగారంను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐ యుగంధర్, ఎస్ఐ జయప్ప, కానిస్టేబుల్ రఫీ, అక్బర్, హోంగార్డు శేఖర్‌ను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ ప్రమోద్ అభినందించారు.

కర్నూలు జీజీహెచ్‌లో రెండు అరుదైన ఆపరేషన్లు



రోగులతో సూపరింటెండెంట్, సర్జరీ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు రెండు అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అరుదైన శస్త్ర చికిత్సలను నిర్వహించిన సీనియర్ ప్రొఫెసర్ రామకృష్ణ నాయక్, ప్రొఫెసర్ జయరాంతో పాటు వైద్యబృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా శనివారం జనరల్ సర్జరీ రెండో యూనిట్ చీఫ్ ప్రొఫెసర్ రామకృష్ణ నాయక్ విలేకరులతో మాట్లాడారు. బేతంచెర్లకు చెందిన 25 ఏళ్ల సుమలత తరుచూ రక్తవాంతులు, అధిక రక్తస్రావం ప్యాన్సిట్రోపెనీయా కారణంగా పునరావృత రక్తమార్పిడి తీసుకుంటున్నారన్నారు. గతంలో ఈవీఎల్ బ్యాండిల్ చేయించుకున్న రోగి గత నెల 15వ తేదీన ఆసుపత్రిలో చేరిందన్నారు. ఈ నెల 24వ తేదీన స్ప్లినెక్టమీ అనంతరం స్ప్లీనోరెనాల్ షంట్ శస్త్ర చికిత్సను నిర్వహించామన్నారు. తర్వాత ప్లీహం (స్ప్లీన్) పరిమాణం 20/15 సెం.మీల బరువు మారుగా 1.5 కిలోలుగా నమోదైందన్నారు. ఆపరేషన్‌కు ముందు రోగి ప్లేట్‌లెట్ల సంఖ్య 40 వేలు ఉండగా.. ఆపరేషన్ తర్వాత 5 లక్షలకు పెరిగి ఆరోగ్యంగా ఉండటంతో ఈ నెల 9వ తేదీ డిశ్చార్జ్ చేశామన్నారు. రెండో కేసు గోనెగండ్లకు చెందిన రంగస్వామి (53) మద్యపానం అలవాటు ఉంది. తరుచూ కడుపునొప్పితో బాధపడుతున్నారు. రోగి జూన్ 6వ తేదీ ఆసుపత్రిలో అడ్మిషన్ పొందారు. పరీక్షలు నిర్వహించగా క్రానిక్ కేల్సిఫిక్ పాంక్రియాటైటిస్‌గా నిర్ధారణ అయింది. దీంతో అదే నెల జూన్ 29వ తేదీ లాటరల్ ప్యాంక్రియాటీ కోజేజునోస్టమీ చేశారు. ఆపరేషన్‌లో పాంక్రియాస్‌లో సుమారు 10 రాళ్లు, అతిపెద్దది, 3/2 సెంటీమీటర్ పరిమాణంలో ఉండటం అరుదైన అంశంగా గుర్తించారు. జూలై 7వ తేదీన రోగిని డిశ్చార్జ్ చేశారు. ఈ రెండు కేసులు పూర్తిగా ఆరోగ్యంగా ఉండటంతో వైద్యులు విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆపరేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్లు సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రణీత్, ప్రశాంతి, అనస్థీషియా వైద్యులు సుధీర్, అరుణలత, సంజీవకుమార్, పీజీలు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో బాలికకు డెంగీ?

- మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలింపు

వెల్దుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన ఓ బాలికకు డెంగీ లక్షణాలు కనిపించాయి. జ్వరంతో మూడు రోజుల నుంచి బాధపడుతున్న బాలిక వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంంది. అయినా నయం కాకపోవడంతో వైద్యుల సలహా మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లారు. గ్రామంలో దోమల బెడద అధికంగా ఉందని, పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభావంతుల కోసమే..

- ఔత్సాహిక క్రీడాకారులకు సువర్ణ అవకాశం
- 2029జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా
- ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా పండుగగా జరిపించేందుకు కృషి
- ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు జోనల్‌స్థాయి పోటీలు
- 16నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు

ఔత్సాహిక క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం సువర్ణ అవకాశం ఇచ్చింది. వీరిలో ప్రతిభను వెలికితీసేందుకు సన్నాహాలు చేస్తోంది. అమరావతిలో 2500ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని క్రీడాకారులకు అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాలు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు 29న ధ్యానచంద్ జయంతి సందర్భంగా క్రీడా పండుగను ఘనంగా నిర్వహించేందుకు శాప్ చైర్మన్ కృషి చేస్తున్నారు. శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉత్సాహం చూపుతున్నారు. తిరుపతిలో జరిగే జోనల్‌స్థాయి పోటీలు ఈ 11నుంచి 14వరకు, విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 16నుంచి 20వరకు నిర్వహించనున్నారు.





బాక్సింగ్ పోటీ

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): 22ఏళ్ల లోపు క్రీడాకారులు తమ ప్రతిభను చూపేందుకు జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి పోటీలను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. 2029.లో అమరావతిలో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఔత్సాహిక క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే రాష్ట్రవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అమరావతిలో దాదాపు 2500ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని క్రీడాకారులకు అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాలు అందుబాటులోకి రానున్నాయి. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జరిగే జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఈ ఏడాది ఆగస్టు 29న ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొన్నేళ్లుగా జాతీయ క్రీడాదినోత్సవం నామమాత్రంగా జరుపుకుంటుండగా ఈఏడాది ప్రత్యేకంగా శాప్ చైర్మన్ రవినాయుడు ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పండుగ జరపనున్నారు. మూడు దశల్లో నిర్వహించే ఈ క్రీడాపోటీలకు శాప్ ఖర్చులు భరించనుంది.

పది క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు..

పది క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తారు. ముందుగా జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి అక్కడ గెలుపొందినవారిని తిరుపతిలో జరిగే జోన్‌స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. జోనల్ విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలు విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తారు. శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉత్సాహం చూపుతున్నారు. ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతినగర్ డీఎస్ఏ మైదానం, ఎస్పీజీ పాఠశాల మైదానం, ఆర్జీఎం క్రీడామైదానాల్లో జరిగిన పోటీల్లో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారు. తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీలు ఈనెల 11నుంచి 14వరకు, విజయ వాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 16నుంచి 20వరకు నిర్వహించనున్నారు.

క్రీడా విభాగాలివి.. ఆర్చరీ, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 400మీటర్లు, 4 ఇంటు 400మీటర్లు రిలే, 800మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లలో పోటీలు నిర్వహిస్తారు.



శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే..

క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా అకాడమీల్లో అవకాశం కల్పిస్తారు. జిల్లాస్థాయి పోటీల్లో మంచిస్పందన లభించింది. క్రీడల అభి వృద్ధికి ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయి. జిల్లాలో క్రీడాసంఘాల ప్రతి నిధులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో జిల్లాస్థాయి పోటీలు విజయవంతం చేశాం. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు, క్రీడాకారులు తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. **- ఎంఎన్‌వీ రాజు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, నంద్యాల**



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అదరగొడుతున్న అన్నదమ్ములు

వారిద్దరికీ చిన్నప్పటి నుంచే క్రీడలంటే మక్కువ. పైగా క్రికెట్ అంటే మరింత ఇష్టం. అందరిలాగే క్రికెట్‌ను ఒక ఆటగా చూడలేదు.. లక్ష్యంగా ఎంచుకున్నారు. సాధన చేస్తే సాధించనిది ఏదీ లేదంటూ ముందడుగు వేశారు. ఇష్టం ఒకవైపు.. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరోవైపు.. వెరసి అన్నదమ్ములు క్రికెట్‌లో అదరగొడుతున్నారు. అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. సాయిగణేశ్ బ్యాటింగ్ రాణిస్తుండగా.. సాయివిఘ్నేశ్ బౌలింగ్‌లో ప్రతిభ చాటుతున్నాడు. దేశం తరపున ఆడడమే తమ లక్ష్యమంటూ చెబుతున్న నంద్యాలకు చెందిన సోదరులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న నంద్యాల సోదరులు
- బ్యాటింగ్‌లో ఒకరు.. బౌలింగ్‌లో మరొకరు
- ప్రశంసలు అందుకుంటున్న సాయిగణేశ్, సాయివిఘ్నేశ్

నంద్యాల రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రాజా, సుమలత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో సాయిగణేశ్ డిగ్రీ, సాయివిఘ్నేశవ్ ఇంటర్ చదువుతున్నారు. తండ్రి స్థానిక పురపాలక పాఠశాలలో 'ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి గృహిణిగా ఉన్నారు. చిన్నప్పటి బ్యాట్ పట్టుకుని తిరుగుతుండడం గమనించిన తండ్రి క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. దీంతో వారు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి స్థానిక శాంతిరాం సంస్థల ఎండీ రఘురాం ప్రోత్సాహంతో స్థానికంగా ఉన్న బెస్ట్ క్రికెట్ ఆకాడమిలో కోచింగ్ తీసుకుంటున్నారు. ఎప్పటికైనా దేశం తరపున ఆడాలన్న ఆశతో నిరంతరం శిక్షణ తీసకుని అటు క్రీడల్లో, ఇటు చదువులో రాణిస్తున్నారు.



సాయిగణేశ్, సాయివిఘ్నేశ్

బ్యాటింగ్‌లో సాయిగణేశ్ ప్రతిభ

- 2023లో వెంకటగిరిలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ -16 క్రికెట్ పోటీల్లో బ్యాటింగ్‌లో ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలు సాధించి ప్రశంసా పత్రాలు అందుకున్నాడు.
- 2023లో అస్సాంలో జరిగిన రాష్ట్ర ప్రాబబుల్స్‌లో బీసీసీఐ డొమెస్టిక్ ఆడి నంద్యాల నుంచి మొదటి క్రికెటర్‌గా ఘనత సాధించాడు.
- 2025లో కడపలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ -19 క్రికెట్ పోటీల్లో (టెస్టులు) 274 పరుగులు సాధించి బహుమతి అందుకున్నారు.
- 2025లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆంధ్ర-బి జట్టులో స్థానం సాధించి 87 పరుగులతో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

లెగ్ స్పిన్‌తో రాణిస్తున్న సాయివిఘ్నేశ్

- 2023లో వెంకటగిరిలో జరిగిన అండర్ -16 క్రికెట్ పోటీల్లో 4 టెస్ట్ మ్యాచ్‌ల్లో 14 వికెట్లతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.
- 2024లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌లో ప్రతిభ కనబరిచి బహుమతి అందుకున్నారు.
- 2025లో కడపలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో మూడు టెస్టుల్లో 17 వికెట్లు తీసి జట్టు విజయానికి కృషి చేశారు.
- 2025లో కడపలో జరిగిన క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు తరపున ఏకంగా ఆరు వికెట్లు తీసి జట్టుకు విజయం అందించి బహుమతి అందుకున్నారు.

మాజీ ఆర్మీ అధికారి ఇంటిపై ఎక్సైజ్ దాడులు

- 53 డిఫెన్స్ మద్యం బాటిళ్లు సీజ్
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు



స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ లిక్కర్‌ను చూపుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది

కర్నూలు అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మాజీ ఆర్మీ అధికారి ఇంటిపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించింది. డిఫెన్స్‌కు సంబంధించిన 53 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు తెలిపారు. వివరాలు.. ముందస్తుగా అందిన సమాచారం మేరకు.. శనివారం నగరంలోని తిరుమలగిరి టౌన్ షిప్ వద్ద మాజీ ఆర్మీ నగేష్ రావు ఇంట్లో తనిఖీలు నిర్వహించాం. డేవర్స్ విస్కీ-18, బ్లాక్ డాగ్ గోల్డ్- 12, బ్లాక్ డాగ్ బ్లాక్-12, రాక్‌ఫోర్డ్ 11 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించగా 'ఆర్మ్‌డు పేరా మిలిటరీ ఫోర్సెస్ ఆర్మీ పర్సనల్‌కు మాత్రమే అమ్మబడును అని ఉంది.

వీటిని ఎక్కడి నుంచి తెచ్చారని ప్రశ్నించగా, బెంగళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో తీసుకుని ఇక్కడ అధిక రేట్లకు అమ్మేందుకు తెచ్చినట్లు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, సీఐలు చంద్రహాస్, రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు రెహానాబేగం, ఇంద్రకరణ్ తేజ, సిబ్బంది రామలింగ, చంద్రపాల్, రాణి, లాలప్ప, తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ఘనంగా మహాలక్ష్మీ యాగం

మహానంది, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ లోని గంగా సమేత మరకతలింగేశ్వరుని స్వామి ఆలయంలో శనివారం ఘనంగా మహాలక్ష్మీ యాగంను నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత కనుమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మరకతలింగేశ్వరునికి ఉదయం ప్రత్యేక ఋత్వికులు గణపతి పూజా, పుణ్యాహవాచనము, అభిషేక పూజ లను వేదమంత్రాలతో జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాల మంటపాల్లో వందలాది మంది భక్తులు పాల్గొనగా మహాలక్ష్మి యాగంను భక్తి శ్రద్ధల తో జరిపారు. వివిధ ద్రవ్యాలతో పూర్ణాహుతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

రాఘవేంద్రుడి సన్నిధిలో ప్రముఖులు

- ఘనస్వాగతం పలికిన మఠం అధికారులు
- ఆశీర్వదించిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మహా ముఖద్వారం వద్ద తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి

మంత్రాలయం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో రెండో రోజు శనివారం రాత్రి పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ యువజన క్రీడలు, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్ణాటక హైకోర్టు జడ్జిలు జస్టిస్ శ్రీషానంద, జస్టిస్ టీఎం నదాఫ్, కర్ణాటక డిప్యూటీ సోషలిటర్ జనరల్ జడ్జి జస్టిస్ శాంతిభూషణ్, జస్టిస్ జ్యోతి ముళిమణి వేర్వేరు సమయాల్లో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. వీరికి శ్రీమఠం అధికారులు ఎస్కే శ్రీనివాసరావు, ఎస్కే కేశవ్ విఠల్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్‌లు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామిని దర్శించుకుని పీఠాధిపతి ఆశిస్సులు పొందారు. వీరి వెంట ఏఏవో మాధవశెట్టి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వేంకటేశ్వర స్వామికి పూజలు


దీపాలంకరణలో వేంకటేశ్వరుడు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి జన్మదినం సందర్భంగా నంద్యాల సంజీ వనగర్ కోదండ రామాల యంలో వెలసిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా విశేష పూజలు, అభిషే కాలు, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు విశేష దీపాలం కరణలో శ్రీనివాసుడు భక్తుల కు దర్శన మిచ్చారు.

పోరాటాలకు సిద్ధం కావాలి : సీఐటీయూ


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలం భిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ పట్టణ 3 మహాసభలను నిర్వహించారు. ముందుగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లతో కుదింపు చేసి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తోందని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో విఫలమైందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అంగన్‌వాడీలకు, ఆశాలకు, మున్సిపల్ కార్మికులకు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు, వెలుగు వీఓఏలకు కనీసం వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రణధీర్, సురేంద్ర, సుబ్బయ్య, నాగన్న, పెద్దనాగరాజు, మంజుల, శాంతి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్‌ఎంలను వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న అధ్యక్షుడు రఘుబాబు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ హంస అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు బి.రఘుబాబు కోరారు. శనివారం జీజీహెచ్‌లోని డైస్ భవనంలో ఏపీ హంస నంద్యాల తాలుకా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రఘుబాబు మాట్లాడుతూ ఏపీ హంస అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని, సభ్యుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని తక్షణమే రెగ్యులర్ చేయాలని, అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులకు వందశాతం జీతాన్ని అమలు చేయాలని కోరారు. నంద్యాల తాలుకా నూతన అధ్యక్షుడు వరప్రసాద్ మాట్లాడుతూ సభ్యుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎ.విజయ కుమార్, ఆత్మకూరు తాలుకా అధ్యక్షుడు టి.కరుణాకర్, కోవెలకుంట్ల అధ్యక్షుడు కె.పురుషోత్తంరెడ్డి, సీనియర్ నాయకుడు ఎ.నాగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు గుద్దేటి వెంకటేశ్వర్లు, నంద్యాల తాలుకా కార్యదర్శి సర్వర్‌బాషా, సహాధ్యక్షుడు రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరి కిరణ్, సంయుక్త కార్యదర్శి రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి


మాట్లాడుతున్న సామాజిక వైద్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సామాజిక వైద్యకేంద్రం సూపరింటెం డెంట్ డాక్టర్ రాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆసుపత్రిలో గర్భిణులకు మూత్ర, రక్తపరీక్షలు, స్కానింగ్‌తో పాటు ఉచి తంగా ప్రొటీన్ పౌడర్లు, మందులను పంపిణీ చేశారు. అలాగే రక్తహీ నత, థైరాయిడ్, బీపీ, షుగర్ వంటి జబ్బుల గురించి అవగాహన కల్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికా హారం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా యోగా చేస్తూ మా నసిక ఆనందాన్ని కలిగి ఉండాలని సూచించారు. పిల్లల ఎదుగుదల కోసం అవసరమైన ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్స్, విటమిన్స్, మినరల్స్‌తో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఇంట్లో ఎవరైనా క్షయ వ్యాధిగ్రస్థు లంటే గర్భిణులకు త్వరగా సోకే ప్రమాదం ఉందని, ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసన్నలక్ష్మి, సౌఖత్, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

అహోబిలం మఠంలో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలోని రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణం, గోపూజ, ధాన్యపూజ లక్ష్మీపూజ చేశారు. అనంతరం వేణుగోపాల్‌స్వామి మాట్లాడుతూ పూర్వ రాధన మధ్యారాధన ఉత్తరాజ మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారన్నారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి ఆశీర్వాదాలు తీసుకోవాలని కోరారు. ఆలయ మేనేజర్ వినయ్‌ప్రసాద్, అర్చకులు జోషి పివమానాచార్య పాల్గొన్నారు.

నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష

● ఘనంగా రక్షాబంధన్



నంద్యాల కల్చరల్: యోగా కేంద్రంలో రాఖీ పండుగ.. అమ్మ స్ఫటికలింగేశ్వరాలయంలో హోమాలు.. వెలుగోడు: రాఖీ కడుతున్న చిన్నారి

రక్షాబంధన్ వేడుకలు శనివారం నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. 'నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష' అంటూ అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపి తమ ఆత్మీయతను చాటుకు న్నారు. సోదరీమణులు తమ సోదరుల కుడిచేయి ముంజేతికి రాఖీ కట్టి నుదుట తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించారు. అలాగే సోద రులు తమ అక్కాచెల్లెళ్లకు మిఠాయిలు తినిపించి తమ శక్తిమేరకు కానుకలు అందజేశారు.

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మండలంలోని కరివేన, నల్లకాల్వ, బాపనంతాపురం, ముష్టేపల్లి, సిద్దేపల్లి, వడ్లరా మాపురం, వెంకటాపురం, సిద్దాపు రం, కృష్ణాపురం, అమలాపురం, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం తదితర గ్రామాల్లో కూడా రక్షాబంధన్ నిర్వహించారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మం డలంలోని ఆయా గ్రామాల్లో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. రాఖీలు కట్టి మిఠా యిలు తినిపించారు. శనివారం శిశు మందిర్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

నంద్యాల కల్చరల్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఆయుష్ యోగా కేం ద్రం నిర్వాహకులు ఆనంద్‌గురూజీ పేర్కొ న్నా రు. శనివారం ఆయుష్ యోగా కేంద్రంలో రాఖీ పౌర్ణమి వేడుక లు జరిగాయి. ఆనంద్ గురూజీ మాట్లాడుతూ రక్షాబంధన్ సోదర, సోదరీ మణుల మధ్య ప్రేమాభిమానాలను పటిష్ఠప రుస్తుందన్నారు.

● అమ్మ స్ఫటికలింగేశ్వరాలయంలో..

నంద్యాల హౌసింగ్‌బోర్డు కాలనీలోని అమ్మ స్ఫటికలింగే శ్వరాలయంలో ఆలయ నిర్వాహకుడు యోగానంద్ ఆధ్వర్యంలో శనివారం శ్రావణపౌర్ణమి, రాఖీపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, యోగాసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వసతుల్లేని గృహంతో వేగేదెలా..?

నంద్యాల రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చక్కటి వసతుల మధ్య పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వాలు వసతిగృహాలను ఏర్పాటు చేశాయి. ఈ హాస్టళ్లలో సమస్యలు ఉండవని, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని నమ్మి వారి తల్లిదండ్రులు వసతిగృహాలకు పంపుతున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వసతిగృహాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు సమస్యల మధ్య కొట్టుమి ట్టాడుతున్నారు. గత ప్రభుత్వంలో వసతిగృహాలకు గ్రహణం పట్టిందనడానికి ఇదో చక్కటి ఉదాహరణ. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఎస్సీ వెల్ఫేర్ కళాశాల వసతిగృహ విద్యార్థులను సమస్యలు వెంటాడుతున్నాయి. హాస్టల్‌కు వెళ్లే రోడ్డు పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ ద్వారా వెళ్లాల్సి వస్తోంది. ఈ దారి చిన్నపాటి వర్షం కురిసినా బురదమ యమవుతోంది. ఆ సమయంలో విద్యార్థులకు నానా అవస్థలు తప్పడం లేదు. అలాగే వసతిగృహానికి రక్షణగోడ లేకపోవడంతో తరచూ పాములు సంచరిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఈ సమస్యను అధికారులకు పలుమార్లు విన్నపించినా ఎలాంటి ప్రయోజనం లేదని, కూటమి ప్రభుత్వం అయినా సమస్యను తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.


హాస్టల్ చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు

చాలా ఇబ్బందులు పడుతున్నాం



హాస్టల్‌కు వెళ్లే రోడ్డు పిచ్చిమొక్కలు, కంపచెట్లతో మూసుకుపోయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ ద్వారా వెళ్తున్నాం. చిన్నపాటి వర్షం కురిసినా ఈ దారి బురదమయమవుతోంది. ఆ సమయంలో బయటకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలి.
- అరవింద్, వసతిగృహ విద్యార్థి

పాములు వస్తున్నాయ్ సార్...



వసతిగృహానికి రక్షణగోడ లేదు. చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో వసతిగృహం ఆవరణలోకి తరచూ పాములొస్తున్నాయ్. వర్షాకాలంలో ఎక్కువగా సంచరిస్తున్నాయ్.. బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. రాత్రి సమయంలో అయితే మరింత ఆందోళనపడుతున్నాం. ప్రాణా పాయం జరుగక ముందే సమస్యను పరిష్కరించండి సార్.
- నాయక్, వసతిగృహ విద్యార్థి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారులను అభినందిస్తున్న నూర్

ఆత్మకూరురూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవి ష్యత్తు ఉంటుందని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు నూర్, చైర్మన్ ఫసిఫిల్ మున్నా తెలిపారు. శనివారం నంద్యాల జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ఆత్మకూరుకు చెందిన 12 మంది బాలురు, 12 మంది బాలికలు రాష్ట్ర స్థాయికి ఎంపిక కా వడంతో ఆ క్రీడాకారులను వారు అభినందించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సం దర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ఆత్మకూరు కేవీకే స్టేడియంలో శిక్షణ పొందిన ఈ క్రీడా కారులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ క్రీడా శిక్షణ శిబిరం నుంచి జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ నెల 16న క్రీడాకారులు జోన్-4లో తిరుపతిలో నిర్వహించే ఖోఖో పోటీల్లో పాల్గొనను న్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఖోఖో శిక్షకుడు మహబూబ్, తైక్వాండో శిక్షకులు ఖాజా హుసేన్, సాదిక్‌లు పాల్గొన్నారు.

మండల మీట్‌కు అధికారుల గైర్హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు


ఎంపీపీకి వినతి పత్రం అందజేస్తున్న నాగరాజు

కొత్తపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకు ఒకసారిగా జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కీలకమైన శాఖల మండల అధికారులు గైర్హాజరయ్యారు. హాజరైన కొద్దిపాటి అధికారులతోనే మండల సమావేశాన్ని మమ అనిపించారు. శనివారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత అ ధ్యక్షతన ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషా ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్, మైనర్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, పశుసంవర్ధక, నీటిపారుదల, ఫైర్ తదితర శాఖలకు చెందిన అధికారులు గైర్హాజర్ కాగా, వీరిలో కొందరు సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. తమ గ్రామ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని గువ్వలకుంట్ల ఎంపీటీసీ స్రవంతమ్మ, తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సమావేశానికి హాజరైన ఎంఈవో, వ్యవసాయాధికారిణి, ఏపీఎం, ఏపీవో, వైద్యాధికారులు, హౌసింగ్, డిప్యూటీ తహసీల్దార్, వెలుగు అధికారులు మా త్రం సమాచారాన్ని సభ్యులకు వివరించారు.

● పాఠశాలకు దారి చూపండి

మండలంలోని ఎదురుపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు విద్యార్థులు వెళ్లేందుకు దారి చూపాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషా, ఎంపీపీ కుసుమలతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ఎదురుపాడు ఎంపీపీ పాఠశాలలో సుమారు 100మంది విద్యార్థులు ఉన్నారని, వారు పాఠశాలకు వెళ్లేందుకు కేవలం మూడు అడుగుల దారి మాత్రమే ఉన్నందున ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే నాగంపల్లి ఎస్సీ కాలనీలో ఇద్దరు ఇంతకు ముందు రోడ్డును ఎత్తుగా పెంచి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశాలకు అధికారులు రాక పోతే ఎలా?

● సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ

వెలుగోడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు రాక పోతే ఎలా అని వైస్ ఎంపీపీ నసీరుద్దీన్‌బాబు ప్రశ్నించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి పాటుపడుదాం అని పిలుపునిచ్చారు. అధికారులు హాజరైతే సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం లభిస్తుందన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ నివేదకలను చదివి వినిపిం చారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా కోరంలేక సభ్యు లు వచ్చే వరకు వేచివుండి 12 గంటలకు మొదలు పెట్టారు. గంటన్నర లోపే సమావేశాన్ని ముగించి మమ అనిపించారు. అలాగే ప్రజాప్రతినిధులు సైతం నామమాత్రంగా హాజరు కావడంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమావేశం నుంచి ఒక్కొక్కరు మెల్లగా జారుకోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇలియాజ్‌ఖాన్, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో మురారి. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లిపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

వైభవంగా సత్యసాయి శతజయంతి

నంద్యాల కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ పార్కులో వెలసిన ఆయుష్ యోగా కేంద్రంలో శనివారం సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. యోగా కేంద్రం నిర్వాహకుడు ఆనంద్ గురూజీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యుడు భైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రామక్రిష్ణా విద్యాసంస్థల అధినేత డా.రామక్రిష్ణారెడ్డి, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భిక్షమయ్యగురూజీ హాజరయ్యారు. భైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా మన రాయలసీమలో అవతరించడం మనందరి అదృష్టమన్నారు. ప్రపంచదేశాలలో సత్యసాయి భక్తులు ఉన్నారంటే అది మనం గర్వించదగ్గ విషయమన్నారు. ఐదుగురు పేదవిద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, మహేశ్వర నాయుడు, యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం


కేక్ తినిపిస్తున్న చెంచు మహిళా సంఘం అధ్యక్షురాలు ఉసేనమ్మ

వెలుగోడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచు గూడెంలో శనివారం ఆదివాసీ దినోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని ప్రాథమిక పాఠశాలలో గూడెం అధ్యక్షురాలు ఉసేనమ్మ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖలీల్, హిదాయత్ అలీఖాన్, రఫి, శాలుబాషా, చెంచులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ తాలుకా కార్యదర్శి, కేజీ రోడ్డు హమాలీ వర్క్ యూనియన్ నాయకులు చాంద్‌బాషా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, రాజీవ్, రాజు పేర్కొన్నారు. శనివారం తమ డిమాండ్ల సాధన కోసం స్థానిక పాతమున్సిపల్ కార్యాలయం ఎదుట టూల్స్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల పీఎఫ్ బకాయిలను జమ చేయాలని, పనిముట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పని విధానంలో ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికులకు యుద్ధప్రాతిదికన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చిన్ననందయ్య, రామకృష్ణ, నరసింహుడు, దొరస్వామి, రూతమ్మ, దానమయ్య, శేఖర్, హేమంత్, నాగన్న తదితరులు ఉన్నారు.

ఆలయ పాలక మండలికి దరఖాస్తు చేసుకోండి

బండిఆత్మకూరు, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రం పాలక మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకృతి నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాలక మండలికి 11 మంది సభ్యుల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 27 లోపు నంద్యాల శివారులోని రైతునగరంలో ఉన్న జిల్లా వేవదాయశాఖ అధికారి కార్యాలయంలో నేరుగా అందజేయవచ్చని ఈవో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోసానికి గురికావొద్దు: ఎస్‌ఐ


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ జగన్మోహన్

బండిఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు మోసానికి గురికావొద్దని ఎస్‌ఐ జగన్మోహన్ సూచించారు. శనివారం రాత్రి మండలంలోని చిన్నదేవళాపురంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మా ట్లాడుతూ మోసగాళ్లు చూపే అత్యాశ ఎరకు లోనై ఉన్నది పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. రైతులు ధాన్యాన్ని రూ.10 తక్కువైనా నగదుకే అమ్ముకోవాలన్నారు. మోసగాళ్లు తక్కువ రేటుకు బంగారం, నగదుకు డబుల్ నగదు లాంటి ఆశలు చూపిస్తారని, ఇటీవల సెల్‌ఫోన్‌లో సైబర్ నేరగాళ్లు మో సానికి గురిచేస్తున్నారని, వారి వలలో పడొద్దని ఆయన సూ చించారు. అనవసర గొడవలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న వేద పండితులు, దంపతులు

చాగలమర్రి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూదురాళ్లపల్లె గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం శ్రావణమాసం, శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా జరిగింది. ఉభయదారులు పులి చిన్న ఓబుళరెడ్డి, చిన్న కొండారెడ్డి, నరసింహారెడ్డి దంపతులచే శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి కల్యాణం చేశారు. తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సారా రహిత సమాజాన్ని తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సతీష్

అవుకు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని సారా రహితంగా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్ సీఐ సతీష్ శనివారం తెలిపారు. కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, నంద్యాల డీపీఈవో రవికుమార్ ఆదేశాల మేరకు శనివారం సారా బట్టీలపై దాడులు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్, స్పెషల్‌పార్టీ టీం, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏడు బృందాలుగా ఏర్పడి కొండమనాయునిపల్లె, పిక్కెళ్లపల్లితండాల్లోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు జరిపామన్నారు. మూడు సారా బట్టీలను, 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీ, విక్రయదారులను గుర్తించి 85 మందిపై బైండోవర్, మరో 144 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సారాతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. దాడుల్లో కర్నూలు, నంద్యాల ఎక్సైజ్ సీఐలు జయరాంనాయుడు, కృష్ణమూర్తి, ఎస్ఐలు కమలాకర్, దౌలత్‌ఖాన్, రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అహోబిలం మఠంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు వేణుగోపాల్

ఆళ్లగడ్డ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలోని రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణం, గోపూజ, ధాన్య పూజలక్ష్మీ పూజ చేశారు. అనంతరం వేణుగోపాల్‌స్వామి మాట్లాడుతూ పూర్వ రాధన మధ్యారాధన ఉత్తరాజ మూడు రోజుల పాటు వైభవం గా నిర్వహిస్తారన్నారు. భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామి ఆశీర్వాదాలు తీసుకోవాలని కోరారు. ఆలయ మేనేజర్ వినయ్‌ప్రసాద్, అర్చకులు జోషి పివమానాచార్య పాల్గొన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఉయ్యాలవాడ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం శ్రావణమాస పూజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సుద్దమల్ల గ్రామంలోని కంబగిరి స్వామికి అర్చకుడు కమలేశ్వరశర్మ, ఆర్.జంబులదిన్నె గ్రామ మెట్ట వద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామికి అర్చకుడు కీర్తిలక్ష్మణ స్వామి, ఉయ్యాలవాడ సమీపంలోని శ్రీవేణుగోపాలస్వామికి నాగేశ్వరరెడ్డి అభిషేకం చేసి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సుద్దమల్ల గ్రామంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులు తీర్థ, ప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా నూతనంగా వచ్చిన ఈవో బాలచెంచన్న ప్రత్యేక పూజలు చేశారు. ఈయనలకు ఆయన మాజీ ధర్మకర్త నారాయణరెడ్డి, అర్చకుడు కమలేశ్వరశర్మలు ఘనస్వాగతం పలికారు.

టీడీపీతోనే బీసీలకు ఆత్మగౌరవం



మాట్లాడుతున్న మల్లికార్జున

డోన్ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీనే అని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా తొలిసారిగా రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీకి దక్కిందన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి రుణాలు ఇచ్చి బీసీలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల్లో సబ్సిడీ అందించి బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేసిందన్నారు. 2025-26 వార్షిక బడ్జెట్‌లో 1000కోట్లు కేటాయించిందని ఐదేళ్లలో రూ.5వేలు కోట్లు కేటాయించబోతోందన్నారు. చేతి వృత్తుల వారికి భరోసా కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. బీసీలను సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి బాటలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఘనంగా రక్షాబంధన్

- రాఖీలు కట్టి తమ ప్రేమను వ్యక్తం చేసిన సోదరీలు

బేతంచెర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంతో పాటు పట్టణంలో శనివారం రాఖీ పండుగను అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. శనివారం సరస్వతి శిశు మందిర్ పాఠశాల, బాలికల ప్రభుత్వ పాఠశాలలో అధికారులకు రాఖీలు కడుతూ నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్ష అంటూ రాఖీలు కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌బాబుకు స్టేషన్‌లోని పోలీసులకు, ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులకు చిన్నారులు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదాలు పొందారు.



బేతంచెర్లలో హెడ్ కానిస్టేబుల్‌కు రాఖీ కడుతున్న బాలికలు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో టీటీడీ దేవ స్థానం, ఉమ్మడి కర్నూలు జిల్లా హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి రక్షాబంధన్ సందేశాన్ని వివరించారు. దేశం సురక్షితంగా ఉంటే ధర్మం సురక్షితంగా ఉంటుందన్నారు. ప్రజలు సమైక్యంగా ఉండడానికి పండుగలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, సర్పంచ్ సరస్వతమ్మ, భజనమండలి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, హను మంతరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, టీచర్ ఉసేనయ్య, నాగమల్లేశ్వర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, జయరామిరెడ్డి, పురుషోత్తమరెడ్డి, జయమ్మ, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాంప్రదాయబద్ధంగా అన్న, తమ్ముళ్లకు చెల్లెళ్లు, అక్కలు రాఖీలు కట్టి భవిష్యత్తు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. అక్కాచెల్లెళ్లకు అన్నలు ఆశీర్వదించి బహుమతులు అందజేశారు.

చాగలమర్రి: మండలంలో రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల బస్టాండు సమీపంలోగల ప్రాథమిక పాఠశాలలో రాఖీ పండుగను వైభవంగా చేశారు. విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకొని నువ్వు నాకు రక్షా, నేను నీకు రక్షా అంటూ రక్షాబంధన్ జరుపుకున్నారు. అలాగే విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు స్టేషన్, పలు చోట్ల రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు మేడా ప్రభాకర్, హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు తమ సోదరుల కు రాఖీ కట్టి శుభాకాంక్ష లు తెలిపారు. అలాగే శిశు మందిరం విద్యార్థులు పట్టణంలో తిరిగి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



రేవనూరులో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



చాగలమర్రి ప్రాథమిక పాఠశాలలో రాఖీ కట్టుకుంటున్న విద్యార్థులు

హామీలన్నీ నెరవేరుస్తున్నాం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఆళ్లగడ్డలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గెలిచిన ఏడాదిలోనే పంచాయతీ రాజ్ ఎన్ఆర్ఐజీఎస్ ఫండ్స్ కింద రూ.17కోట్ల, బీటీ రోడ్ల కింద రూ.18.9కోట్ల మంజూరుచేసి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. మండలానికి రూ.2 కోట్లు అదనంగా తీసుకొని వచ్చి రూ.13 కోట్లతో రోడ్ల వేయిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లగా తండావాసులు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డకు పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు సాగు సహాయం అదించామని అలాగే రైతులందరితో కలిసి పార్టీలకు అతీతంగా సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. శిల్పా వెంచర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అప్రువల్ ఇచ్చిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంచర్‌లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి తగిన న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ప్రయాణాల్లో నిర్లక్ష్యం వద్దు

కొలిమిగుండ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రహదారుల్లో ప్రయాణించే సమయంలో నిర్లక్ష్యం వద్దని కొలిమిగుండ్ల ఎస్ఐ గోపాల్ సూచించారు. శనివారం కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు సర్కిల్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. మోటార్‌సైకిల్ ప్రయాణికులు హెల్మెట్ తప్పక ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని, వాహన పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచిం చారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి, ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, మద్దయ్య, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న కొలిమిగుండ్ల ఎస్ఐ గోపాల్

పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించవద్దు: ఎస్ఐ



కోవెలకుంట్లలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించవద్దని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఆనంద్ సర్కిల్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించుకుంటే ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ఆటోకు సంబంధించి ప్రతి రికార్డు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్న కొత్త మోటారు చట్టంపైన డ్రైవర్లు అవగాహన పెంచుకోవాలన్నారు.

సంజామల: హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని ఎస్ఐ రమణయ్య అన్నారు. శనివారం సాయంత్రం ఆకుమళ్లలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలతో మాట్లాడుతూ లైసెన్స్‌లేకుండా ప్రయాణించడం, వాహనాలకు ఇన్సూరెన్స్ లేకుండా నడపడం నేరమన్నారు. పరిమతికి మించి ప్రయాణీకులకు ఎక్కించరాదని హెచ్చరించారు.

12న ఉచిత కంటి వైద్యశిబిరం

కొలిమిగుండ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఈనెల 12న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఐమిత్ర కంటి వైద్య నిపుణులు పులిపాటి గోపాల్ శనివారం వెల్లడించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ప్రత్యేక బస్సులో కడప పుష్పగిరి ఆసుపత్రికి తరలించి, శస్త్ర చికిత్సల అనంతరం కొలిమిగుండ్లకు తీసుకవస్తామన్నారు. ఇందుకోసం ఎటువంటి చార్జీలు వసూలు చేయరని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

డోన్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): డోన్ ఆంజనేయ స్వామి కొండపై లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. మాణిక్యప్రభు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణానికి భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాణిక్యప్రభు సేవా సమితి సభ్యులు కోట్రికే సురేష్, జొన్నలగడ్డ శ్రీధర్, మాకం ఆంజనేయులు, కిషన్‌సింగ్, భక్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- పర్యావరణానికి తూట్లు
- బోసిపోతున్న రహదారులు
- చోద్యం చూస్తున్న వివిధ శాఖల అధికారులు

బనగానపల్లె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చెట్లు ప్రగతికి మెట్లు. అలాంటి పెద్ద పెద్ద వృక్షాలను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నరికివేస్తున్నారు. పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. దీంతో రహదారుల వెంట నీడ లేక బాటసారులు ఇబ్బందులు పడుతు న్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామాల వెంట, ప్రధాన రహదారుల్లోని ఏళ్లనాటి చెట్లను గుట్టు చప్పుడు కాకుండా అధికారుల కళ్లుగప్పి స్మగ్లర్లు నరికివేసి సొమ్ముచేసుకుంటున్నారు. బ్రిటిష్, నవాబుల ఏలుబడిలో బనగానపల్లె నియోజవర్గంలో బనగానపల్లె -పాణ్యం, బనగానపల్లె- టంగుటూరు, బనగానపల్లె- కోవెలకుంట్ల, కోవెలకుంట్ల- సంజామల, బనగానపల్లె- అవుకు, కోవెలకుంట్ల - నంద్యాల, కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ, బనగానపల్లె- గుత్తి రహదారుల కిరువైపులా వేపచెట్లు, చింతచెట్లను పెంచారు. బాటసారులు రోడ్డుమార్గంలో వెళ్లేటప్పుడు సేదతీరడానికి వర్షం వస్తే చెట్లకింద ఉండడానికి ఎంతగానో ఉపయోగపడేవి. అయితే కలప వ్యాపారులు వేప, చింతచెట్లను గుట్టు చప్పుడు కాకుండా నరికివేసి రాత్రివేళల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరు బొగ్గుల బట్టి నిర్వాహకులు రోడ్లకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలకు యథేచ్ఛగా నిప్పుపెట్టి బొగ్గులు చేస్తున్నారు.



పండ్లాపురం సమీపంలో నరికివేసిన చెట్టు



నంద్యాల రహదారిలో నరికి వేసిన చింతచెట్టు



టంగుటూరు రహదారిలో రోడ్డులో కాలిపోయిన చెట్టు

మొక్కలు నాటడం మరిచారు

ఏదైనా చెట్టు నరికి వేస్తే వాటి స్థానంలో మరో మొక్కను నాటాల్సిన బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలకు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులపై ఉంది. కానీ ఏవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చొరవ తీసుకొని రోడ్ల వెంట నూతన మొక్కలను పెంచి బాటసారులకు నీడ, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. చెట్లను నరికివేస్తున్న స్మగ్లర్లపై పోలీసులు కూడా ఉక్కుపాదం మోపాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అభిప్రాయపడుతున్నారు.

మినీ గోకులం నిర్మాణాలకు దరఖాస్తులు

శిరివెళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో మినీ గోకులం నిర్మాణాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసశర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి కలిగి ఉండి పాడిపరిశ్రమ ద్వారా జీవనోపాధి పొందుతున్న రైతులు నిర్దేశిత ఖాళీ స్థలంలో మినీ గోకులం నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ. రెండు లక్షలు రాయితీ ఇస్తుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు తమ దరఖాస్తులను ఎంపీడీవో , ఉపాధిహామీ కార్యాలయాల్లో ఇవ్వాలని సూచించారు.

వైభవంగా చెన్నకేశవ పల్లకోత్సవం



చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తుల పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం శ్రావణమాసం కావడంతో వేద పండితుల ఆధ్వర్యంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు. అలాగే మూడురాళ్లపల్లె గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల పల్లకి ఉత్సవం చేశారు. శెట్టివీడు గ్రామంలో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు

చాగలమర్రి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, మూడురాళ్లపల్లె, చాగలమర్రి గ్రామాల్లోని అభయాంజనేయ, వీరాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో జల, పాలాభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు



పూజలందుకున్న స్వామి

కొలిమిగుండ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం - రామాపురం గ్రామాల మధ్య వెలసిన అభయాంజనేయస్వామి సన్నిధిలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. బెలుం, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, మీర్జాపురం, కల్వటాల తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రీతికరమైన ఆకుపూజ, పంచామృతాభిషేకం, పానకం సమర్పణ తదితర పూజలు ఘనంగా నిర్వహించి, ప్రసాద వితరణ చేపట్టారు.

పెద్ద కంబలూరు సొసైటీ చైర్మన్‌గా ప్రతాప్‌రెడ్డి



ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను సన్మానిస్తున్న ఎర్రం ప్రతాప్‌రెడ్డి

రుద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కంబలూరు సొసైటీ చైర్మన్‌గా ఎర్రం ప్రతాప్‌రెడ్డి ని యమితులైయ్యారు. దాంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని ఆయన తెలిపారు.

కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా వెంకటేశ్వరమ్మ



భార్గవ్‌రామ్‌నాయుడుకు బొకే అందజేస్తున్న టీడీపీ నాయకులు

దొర్నిపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా కుమ్మిత వెంకటేశ్వరమ్మను నియమించారు. శనివారం ఆళ్లగడ్డ టీడీపీ సీనియర్ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే అఖిలప్రియ, భార్గవ్‌రామ్‌నాయుడు దంపతులు తనను గుర్తించి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చవ్వ శివారెడ్డి, పైడేల పవన్ కుమార్‌రెడ్డి, నీటి సంఘం ప్రెసిడెంట్ నాగలింగేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అత్తార్‌బాష తదితరులున్నారు.

పేదరిక నిర్మూలన సుపరిపాలనతో సాధ్యం

చాగలమర్రి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సుపరిపాలనతోనే సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకుడు నాగూర్‌వలి తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం వీధిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాలతో ఏడాది సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చిన్నకంబలూరులో పల్లెనిద్ర

రుద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కంబలూరు శుక్రవారం రాత్రి ఎస్ఐ మహమ్మద్ రఫీ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఎస్ఐ మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే 1930నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

డెంగీ అనుమానిత కేసు నమోదు

శిరివెళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కటికపేటలో డెంగీ అనుమానిత కేసు నమోదైనట్లు సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర‌రెడ్డి శనివారం తెలిపారు. డెంగీ నివారణ చర్యల్లో భాగంగా సచివాలయం-3 పరిధిలోని బాధిత కుటుంబ పరిసరాల్లో, నివాసంలో మందులను వారు పిచికారి చేయించారు. ప్రజలు తప్పనిసరిగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

చాగలమర్రి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువులకు వచ్చే వ్యాధుల నివారణ కోసం టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్థకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ముద్దచర్మ, నట్టల నివారణ, గొంతువాపు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు సోకిన వెంటనే పశువులకు చికిత్సలు చేయించాలని అన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి పశుగ్రాస క్షేత్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.